www.prajasakti.com

# ప్రజాశక్తి

బుధవారం 11 అక్టోబర్ 2023

5

తూర్పుగోదావరి

## 13న నాక్ ప్రాంగణంలో మినీ జాబ్‌మేళా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జిల్లాలోని నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు బొమ్మూరు నాక్ ప్రాంగణం(కలక్టరేట్ ఆఫీస్)లో ఈ నెల 13న మినీ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో ప్రముఖ కంపనీలు డాక్టర్ రెడ్డీస్ లాబరేటరీస్ లిమిటెడ్, వరుణ్ మోటార్స్ ప్రయివేటు లిమిటెడ్, ఐఐఎఫ్‌ఎల్ సమస్త ప్రయివేటు లిమిటెడ్, నవత రోడ్డు ట్రాన్స్ పోర్టు ప్రయివేటు లిమిటెడ్ కంపెనీలు హాజరు కానున్నాయని తెలిపారు. వీటిలో గల వివిధ ఉద్యోగాలలో పనిచేయడానికి డిగ్రీ, ఎమ్ కాం, ఎమ్ బిఎ, ఇంటర్, ఐటిఐ, పదవ తరగతి, పూర్తి చేసిన 19 నుంచి 30 సంవత్సరాలలోపు వయస్సు గల వారు అర్హులని ఆయన వివరించారు. కావున నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# ధాన్యం కొనుగోలుకు బయోమెట్రిక్

- రైతు వేలి ముద్ర వేశాకే ధాన్యం తూకం
- ఆధార్ తప్పనిసరి చేస్తూ నిబంధనలు
- ధాన్యం రవాణా వాహనానికి జిపిఎస్ ట్రాకర్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ధాన్యం కొనుగోలుకు కొత్త విధానం అమల్లోకి రానుంది. రైతుల నుంచి బయోమెట్రిక్ లేదా ఐరిస్ సేకరించిన తర్వాతే ధాన్యం కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు అన్ని కొనుగోలు కేంద్రాలు బయోమెట్రిక్ పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా జరిగేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఈ బయోమెట్రిక్ విధానాన్ని తెర మీదికి తీసుకొచ్చింది.కొనుగోళ్లలో అక్రమాలకు ముక్కుతాడు వేయాలనే ఉద్దేశ్యంతోనే కొత్త విధానానికి శ్రీకారం చుట్టినట్లు అధికార యంత్రాంగం చెబుతోంది.

**రైతులు వేలిముద్ర వేశాకే ధాన్యం తూకం**

రైతులు వేలి ముద్ర వేశాకే ధాన్యం తూకం వేయనున్నారు. పతి ఏటా రైతుల పేర్లు చెప్పి దళారులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తలిస్తుండటం పరిపాటిగా మారింది. ఈ పరిస్థితులను అడ్డుకట్టవేసేందుకు అంటూ ప్రభుత్వం ఈ బయోమెట్రిక్ విధానం అమల్లోకి తెస్తున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. కొన్నిచోట్ల తూకంలో తేడాలతో అన్నదా తలను మోసం చేస్తు న్నారు. నిబనంధనలకు మించి తరుగు పేరిట తీసుకున్న ధాన్యాన్ని బోగస్ రైతుల పేరిట విక్రయిస్తున్నారు. మిల్లర్లు సేకరించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో అమ్ముతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇకపై ఇలాంటి అక్రమాలకు తావుండదు. బయోమెట్రిక్ ఆధారిత కొనుగోళ్ల విధానాన్ని తీసుకురావడటమే దీనికి కారణం. రైతు వేలిముద్ర బయోమెట్రిక్ యంత్రంపై వేశాకే తూకం వేస్తారు. రైతు వారీగా కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్‌లో నమోదు చేయడం ద్వారా చెల్లింపులు జరిగే అవకాశం ఉంటుంది.

**రైతుల ఆధార్ తప్పనిసరి**

ధాన్యం కొనుగోళ్లకు బయోమెట్రిక్ విధానం అమలు చేయనున్న నేపథ్యంలో వరిసాగు చేసిన రైతులు ఆధార్ నవీకరణ చేసుకోవడం ముఖ్యం. ఆధార్ నవీకరణ లేకపోతే వేలిముద్ర సరిపోక ధాన్యం విక్రయాలు చేయడం కష్టంగా మానునున్నది. ఇదే విషయాన్ని అధికారులు రైతులకు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం ఈకెవైసీ పునరుద్ధరణతోపాటు ఆధార్‌కార్డు నవీకరణ కూడా పూర్తి చేసుకుంటే ధాన్యం విక్రయించే సమయంలో సమస్య ఉండదంటున్నారు. ఆధార్ కార్డు లేని వారు వాటిని తప్పకుండా తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. లేకుంటే ధాన్యం విక్రయంలో ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని చెబుతున్నారు.

**ధాన్యం తరలించే ప్రతి వాహనానికి జిపిఎస్**

కొనుగోలు కేంద్రాలనుంచి మిల్లులకు ధాన్యం తరలించే వాహనాలకు జిపిఎస్ ట్రాకర్‌ను అమర్చనున్నారు. దీనివల్ల కొనుగోలు కేంద్రాల నుంచి వారికి కేటాయించిన మిల్లు వరకు వాహనం సక్రమంగా వెళతున్నదీ.. లేనిదీ తెలుసుకోవచ్చు. మిల్లర్లు సేకరించిన ధాన్యం కొనుగోలు కేంద్రానికి రాకుండా ఉండడం కోసం ట్రాకింగ్ వ్యవస్థను ఉపయోగించాలని నిర్ణయించారు. ఈ కొత్త విధానంపై కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తారు.

### 55 ధాన్యం కేంద్రాలు ప్రారంభం

తొలి విడతగా 55 ధాన్యం కేంద్రాలను ప్రారంబిస్తున్నాం. రాజమహేంద్రవరం రూరల్‌లో 3, కొవ్వూరులో 14, తాళ్లపూడిలో 14, కడియంలో 7, గోపాలపురంలో 6, సీతానగరంలో 11 కేంద్రాలు ప్రారంభం కానున్నాయి. ఎ-గ్రేడ్‌కు రూ.2,203, బి-గ్రేడ్‌కు రూ.2,183 చొప్పున మద్దతు ధర ప్రకటించారు. 17 శాతం తేమ వరకూ ఆరబెట్టుకోవాలి. రవాణాకు సంబంధించి, గోనెసంచుల ఛార్జీలు రూ.3.39పై ఒక్కింటికి, క్వింటాకు హమాలి ఛార్జీలు రూ.22 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తోంది.

**- ఎ.మోహన్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి**

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న పౌర సరఫరాల ఎండి వీర్యపాండ్యన్, కలెక్టర్ మాధవీలత, జెసి తేజ్ భరత్

# ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం

### పౌర సరఫరాల విసి అండ్ ఎండి వీర్యపాండ్యన్ వెల్లడి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

2023-24 ఏడాది ఖరీఫ్ సీజన్లో రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను అందించి కొనుగోలు చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల విసి అండ్ ఎండి జి. వీర్యపాండ్యన్ తెలిపారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ - ముందస్తు కార్యాచరణ ప్రణాళికపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఖరీఫ్, రబీ కాలంలో ఎదురైన సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత రబీ విధానంలో మెరుగుపరచడం జరిగిందన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ప్రస్తుత ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. రైతుల నుంచి స్వయంగా సమస్యలు తెలుసు కోవడం జరిగిందన్నారు. ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామన్నారు. ఖరీఫ్ సీజన్లో రైతు పండించిన ధాన్యానికి దళారీల ప్రమేయం లేకుండా రైతులకు పారదర్శకంగా మద్దతుగా ధరను అందిస్తామన్నారు. రైతులు తమ సమస్యలను ఫిర్యాదుల రూపంలో ఉన్నతాధికారులకు చెప్పేందుకు వీలుగా జిల్లా, డివిజన్, మండల స్థాయి కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ల అందుబాటులో ఉంచామన్నారు. రైతుల విజ్ఞప్తి మేరకు గత ఏడాది కంటే 10 రోజుల ముందుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. రైతులకు అవసరమైన గన్ని బ్యాగులను ఎప్పటికప్పుడు అందచేస్తామని చెప్పారు. ఈ ఏడాది జిల్లాలో ఖరీఫ్ సీజన్లో ధాన్యం కొనుగోలు చేసే విధానం, అంచనా, సమగ్ర వివరాలు తెలుసుకునేందుకు రావడం జరిగిందని అన్నారు. రైతులు ధాన్యాన్ని కేంద్రాలకు తరలించే క్రమంలో హమాలీ, రవాణా ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఈ ఖర్చును రైతు పెట్టుకుంటే నేరుగా ఆ రైతు ఖాతాలో నేరుగా ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత మాట్లాడుతూ జిల్లాలో 231 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 4.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, మునిసిపల్ కమిషనర్ కె. దినేష్ కుమార్, ఆర్‌డిఒ ఎ.చైత్ర వర్షిణి, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ ఎ.కుమార్, జిల్లా పౌర సరఫరాల అధికారి బి.విజయ భాస్కర్, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

## బల్లిపాడులో నేడు జగనన్నకు చెబుదాం...

ప్రజాశక్తి - తాళ్లపూడి

జగనన్నకి చెబుదాం అనే కార్యక్రమాన్ని మండల స్థాయిలో నెల 11వ తేదీన నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ రమణ, తహశీల్దార్ టి.రాధిక తెలిపారు. తాళ్లపూడిలోని బల్లిపాడు కాకర్ల రామయ్య కళ్యాణ మండపంలో బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరగనున్న ఈ కార్యక్రమంలో హోంమంత్రి డాక్టర్ తానేటి వనిత, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీ లత పాల్గొంటారని తెలిపారు. మండలంలోని తమ తమ సమస్యలను అర్జీల రూపంలో జగనన్న చెబుదాం కార్యక్రమంలో అందించాలని కోరారు.

## మృతురాలి కుటుంబానికి అండగా 'మల్లిపూడి'

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలో చాగల్లు గ్రామానికి చెందిన ఒక మహిళ ఇటీవల మృతి చెందారు. ఈ సమాచారాన్ని తెలుసుకున్న మల్లిపూడి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి మల్లిపూడి ధనరాజు ఆమె కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5 వేల చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గెడ్డం సురేష్, బొలిపో రమేష్, గెల్లా చంద్రరావు, కేతా కాంతారావు, ఎం.జోషి తిమోతి పాల్గొన్నారు.

## విద్యార్థిని కుటుంబానికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - గోపాలపురం

తాళ్లపూడి మండలం అన్నదేవరపేటకు చెందిన కౌలూరి సుజిత బ్రెయిన్, కిడ్నీ వ్యాధితో కోమాలోకి వెల్లడంతో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం పొందుతుంది. ఈ సమాచారాన్ని తెలుసుకున్న జిల్లా అరుంధతి ఉద్యోగులు రూ.15 వేలను ఆమె కుటుంబానికి అందించారు. ఈ.కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు కొడమంచిలి సత్యనారాయణ, బోల్లిపో మధు శేఖర్, గెల్ల రాజు, మెరిపో సూరిబాబు, మేరిపో జలమయ్య, బొల్లిపో గోపీనాథ్ పాల్గొన్నారు.

డివైఇఒకు వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

## శిక్షణా తరగతులను వాయిదా వేయాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

దసరా శెలవుల్లో ప్రాథమిక ఉపాధ్యాయులకు రెండో విడతగా జరుగనున్న ఫండమెంటల్ లిటరసీ అండ్ న్యూమరసి(ఎఫ్ఎల్ఎన్) శిక్షణా తరగతులు వాయిదా వేయాలని జిల్లా యుటిఎఫ్ శాఖ కోరింది. ఈ మేరకు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జయకర్, షరీఫ్, కోశాధికారి ప్రసాద్, కార్యదర్శి రమేష్ రాజమహేంద్రవరం ఉప విద్యాశాఖాధికారి ఇవివిఎస్ఎన్ నారాయణను కలిసి విజ్ఞప్తి చేశారు. దసరా పండుగ అనంతరం శిక్షణా తరగతులను నిర్వహించాలని కోరారు.

## వైసిపి అధికార ప్రతినిధిగా ఖాదర్ వలీ

ప్రజాశక్తి - గోపాలపురం

తూర్పు గోదావరి జిల్లా వైసిపి అధికార ప్రతినిధిగా గోపాలపురంకు చెందిన ఖాదర్ వలీ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడి పనిచేస్తున్న తనకు తగిన రీతిలో గుర్తింపు లభించిందన్నారు. నూతనంగా నియమితులైన ఖాదర్ వలీని ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, జడ్‌పిటిసి కె.లలిత, కరిచర్లగూడెం సర్పంచ్ అన్సర్ భాష, ఉప సర్పంచ్ గాలింకి శ్రీనివాస్ అభినందనలు తెలిపారు.

## తపాలా ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ధర్నా చేస్తున్న పోస్టల్ ఉద్యోగులు

అఖిల భారత తపాలా ఉద్యోగ సంఘాల సమన్వయ కమిటీ పిలుపు మేరకు రాజమహేంద్రవరం పోస్టల్ డివిజనల్ కార్యాలయం వద్ద మంగళవారం ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. తపాలా డివిజన్ గ్రూప్ సి యూనియన్ కార్యదర్శి బి. కొండబాబు మాట్లాడుతూ కాలం చెల్లిన కంప్యూటర్లు, ప్రింటర్లను మార్చకుండా, తగిన నెట్వర్క్ సదుపాయాలు కల్పించకుండా రోజువారీ లక్ష్యాలను నిర్దేశించడం తగదన్నారు. లక్ష్యాల పేరుతో నిత్యం ఉద్యోగులను వేధింపులకు గురిచేయటం మానుకోవాలని కోరారు. పోస్టుమెన్ యూనియన్ కార్యదర్శి జెవి.సతీష్ మాట్లాడుతూ ఉత్తరాలు బట్వాడా సమాచారాన్ని పోస్టుమెన్లు తమ సొంత మొబైల్ ఫోన్ల ద్వారా ఆన్లైన్ అప్డేట్ చేయాలని వేధించడం, అధికారులు నిర్దేశించిన బట్వాడా లక్ష్యాలను పూర్తి చేయలేని ఉద్యోగులను కక్షపూరితంగా వేధించడం మానుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామీణ తపాలా ఉద్యోగుల జిల్లా కార్యదర్శి ఆర్.పుష్కరం మాట్లాడుతూ చిరుద్యోగులైన జిడిఎస్‌కు రిటైర్మెంట్ సమయంలోనే వారికి రావాల్సిన బెనిఫిట్స్ అందజేయాలన్నారు. సంఘాల నాయకులు యుజి.ప్రకాష్, ఐ. శ్రీనివాస్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

ప్రజాశక్తి - నిడదవోలు

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ శ్రీనివాస నాయుడు

నిడదవోలు నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎంఎల్ఎ జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. మండలంలోని తాడిమల్ల గ్రామంలో ఇటీవల నూతనంగా నిర్మించిన పలు ప్రభుత్వ భవనాలను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో రూ.20.80 లక్షల వ్యయంతో డాక్టర్ వైయస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని నిర్మించినట్లు చెఎల్పారు. రూ.21.80 లక్షల తో రైతు భరోసా కేంద్రాన్ని, రూ.25 లక్షలతో సచివాలయం-1, రూ.40 లక్షలతో సచివాలయం-2 భవనాలను నిర్మించినట్లు చెప్పారు. ఈ భవనాలను ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బయ్యే సుధారాణి, ఎంపిపి తిరుమల భాగ్యలక్ష్మి, జడ్‌పిటిసి కొయ్యే సూర్యరావు, కొప్పుల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న జెఎఎస్ క్యాంపులు

ప్రజాశక్తి - యంత్రాంగం

చాగల్లులో జెఎఎస్ శిబిరంలో కంటి వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో నిర్వహించారు. **గోకవరం** మండలంలోని ఇటికాయలపల్లి గ్రామంలో జెఎఎస్ కార్యక్రమం జరిగింది. ఈ శిబిరంలో పాల్గొన్న రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు దాసరి రమేష్, సుంకర వీరబాబు, దారా రామకష్ణ, గుల్లా ఏడుకొండలు, వరసాల ప్రసాద్, చింతల అనిల్ కుమార్, బదిరెడ్డి రాంబాబు, కమ్మిల ఆచ్చిబాబు, గళ్ళ కష్ణ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రంజిని, ఇఒపిఆర్‌డి ఎం.రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. **చాగల్లు** మండలంలోని చాగల్లు గ్రామంలో జెఎఎస్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వివిధ విభాగాలకు చెందిన వైద్యులు రోగులకు వైద్య సేవలందించారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బి.రాంప్రసాద్, తహశీల్దార్ రాజ్యలక్ష్మి, ఇఒపిఆర్‌డి ఆర్.శ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. **గోపాలపురం** మండలంలోని గుడ్డిగూడెం గ్రామంలో జెఎఎస్ కార్యక్రమం సర్పంచ్ మడిచర్ల ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ శిబిరంలో ఎంఎల్ఎ తలారి వెంకట్రావు పాల్గొన్నారు. వైద్యులు రోగులకు వైద్య సేవలు అందించి అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, జడ్‌పిటిసి కె.లలిత, ఎంపిటిసి ఆంజనేయులు, తహశీల్దార్ రవీంద్రనాథ్, ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి పాల్గొన్నారు. **సీతానగరం** మండలంలోని ముగ్గళ్లలో డాక్టర్ రాజు ఆధ్వర్యంలో జెఎఎస్ శిబిరం జరిగింది. ఈ సందర్భంగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గుర్రాల జ్యోస్నా, డాక్టర్ ఎవికె చైతన్య, డాక్టర్ మేఘన, డాక్టర్ యేసురాణి, డాక్టర్ రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

### ఇళ్ల పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి - దేవరపల్లి

సంగాయిగూడెం గ్రామానికి చెందిన లబ్ధిదారులకు గోపాలపురం ఎంఎల్ఎ తలారి వెంకట్రావు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. మంగళవారం ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు పంపణీ చేశారు. అలాగే ఇటీవల దక్షిణాఫ్రికాలో జరిగిన టెన్నికాయిట్ ప్రపంచ కప్ అండర్-23 విభాగంలో దేవరపల్లి గ్రామానికి చెందిన హేమ మాధురి టీం ఛాంపియన్షిప్‌లో బంగారు పతకం, వ్యక్తిగత విభాగం సింగిల్స్, డబుల్స్‌లో కాంస్య పథకం సాధించినందుకు ఎంఎల్ఎ అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రామకృష్ణ, ఎఎంసి ఛైర్మన్ జనార్ధన్ రావు, కూచిపూడి సతీష్ పాల్గొన్నారు.

### సానుభూతితో వైద్య సేవలందించాలి

**కొవ్వూరు రూరల్ :** రోగులకు సానుభూతితో వైద్య సేవలు అందించాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి. ధర్మారావు అన్నారు. ప్రపంచ మెంటల్ హెల్త్ డే సందర్భంగా స్థానిక కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి. ధర్మారావు ప్రభుత్వ వైద్యాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి లోపల, పరిసరాలు శుభ్రంగా ఉండేటట్లు వైద్యులు చూడాలన్నారు. రోగులకు వైద్యుల పట్ల నమ్మకం ఉండేటట్లు సేవలు అందిచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.సాయికిరణ్, సిబ్బంది, యువ న్యాయవాది ఎం. శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

### యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

**తాళ్లపూడి :** ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచి యోగా చేస్తూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని స్థానిక సాగర్ డెంటల్ ఆసుపత్రి అధినేత డాక్టర్ సాగర్ సూచించారు. ఇటీవల కాలంలో పాఠశాలలో జరిగిన వేడుకల్లో విద్యార్థులు చేసిన యోగా ప్రదర్శనలను చూసిన ఆయన విద్యార్థులకు అవసరమైన యోగా కిట్లను అందిస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీని అమలు చేస్తూ మంగళవారం గజ్జరం గ్రామంలో జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులకు యోగా కిట్లను ఆయన అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మోహన్, పిడి విజయ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఆన్‌లైన్‌లో ఇంటి పన్నుల వసూలు

**బిక్కవోలు:** ఇంటి పన్నులను పారదర్శకంగా వసూలు చేయాలన్నా లక్ష్యంతో ప్రభుత్వం డిజిటల్ విధానాన్ని ప్రవేశపెట్టిందని పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ తెలిపారు. ఆనఅన్నారు. పందలపాక పంచాయతీలో మంగళవారం ఆన్‌లైన్ ద్వారా పన్నులు వసూలు చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని రూ.24,99,321 వసూలు చేయవలసి ఉందన్నారు. ఈ మొత్తం ఆన్‌లైన్ ద్వారా చెల్లింపు చేస్తున్నామని తెలిపారు. దీనిలో తొలిరోజు రూ.4,339 వసూలు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తొస్సిపూడి పంచాయతీ కార్యదర్శి అచ్చియ్య చౌదరి, పంచాయతీ గుమాస్తా ఎం.సూర్యనారాయణ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

### ఆర్‌బికెల ద్వారా ఇ క్రాప్ నమోదు

**సీతానగరం :** మండలంలో ఆర్‌బికెల ద్వారా ఇ క్రాప్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి సూర్య రమేష్ తెలిపారు. స్థానిక విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలో 20 ఆర్‌బికెల ద్వారా ఇ క్రాప్ నమోదు చేయడం జరుగుతుందన్నారు. మండలంలో ఇప్పటికే వందశాతం ఈ క్రాప్ నమోదు, ఈకెవైసి చేసి జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉందన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆర్‌బికెల ద్వారా సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఇంకా ఎవరైనా నమోదు చేయలేని రైతులు ఇ క్రాప్ నమోదు చేసుకోవాలని తెలిపారు.

### కాగడాల ప్రదర్శన నిర్వహిస్తే కేసులా..?

**చాగల్లు :** టిడిపి అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా కాగడాల ర్యాలీ నిర్వహించిన వారిపై పోలీసులు అక్రమ కేసులు పెట్టడం దారుణమని మాజీ మంత్రి కెఎస్ జవహర్ అన్నారు. ఊనిగట్ల గ్రామానికి చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదు చేశారని సమాచారాన్ని తెలుసుకున్న ఆయన మంగళవారం ఆ గ్రామాన్ని సందర్శించారు. కేసులను ఎదుర్కొంటున్న వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులు అక్రమ కేసులకు అధైర్యపడవద్దని, ప్రతీ ఒక్కరికీ టిడిపి అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నందిగం పెద్ద అబ్బులు, నల్లూరి సూరిబాబు, నందిగం విష్ణు, నందిగం చినబాబు, పుల్లూరి వెంకటేశ్వరరావు, నందిగం శ్రీనివాస్, లకంసాని రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

### కార్టూ'నిజం'




మన యాపారం కూడా ఇక్కడ ఎత్తేసి తరలిపోతే మంచిదేమోరా.. ఎవరి దగ్గరా అసలు పైసలు వుండం లేదు!

## జగన్ బస్సుయాత్ర హాస్యాస్పదం

ప్రజాశక్తి - గోకవరం

గుంతల రోడ్డును పరిశీలిస్తున్న జ్యోతుల నెహ్రా

రాష్ట్రంలో అధ్వానంగా ఉన్న రోడ్లకు నాలుగున్నరేళ్ల పాలనలో మరమ్మ త్తులు చేయని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నేడు బస్సు యాత్ర చేపడతానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని టిడిపి రాష్ట్ర ఉపాధ్య క్షులు జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని జగన్నాథపురం నుంచి సూదికొండ వరకు ఆయన మంగళవారం పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మంజూరు చేసిన నిధులతో రోడ్లు వేయలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందన్నారు. పెద్దాపురం నుంచి కాట్రావులపల్లి వరకు మల్లిసాల నుంచి గోకవరం వరకు రూ.14 కోట్ల రూపాయలతో గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసి రూ.8 కోట్ల రూపాయలతో పనులు పూర్తి చేసిందన్నారు. అయితే వీటిలో రూ.4 కోట్లను కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయని అన్నారు. నాలుగున్నరేళ్ల పాలనలో ఒక్క రోడ్డుకు కూడా మరమ్మత్తులు చేయని సిఎం జగన్ రెడ్డి ఆ రోడ్లపై బస్సు యాత్ర చేసే అర్హతను కోల్పోయారని పేర్కొన్నారు. గోతుల రోడ్లలో ప్రజలు వెళ్లి నానా ఇబ్బందులు పడితే పట్టించుకోకుండా గాల్లోనే ప్రయాణించిన సిఎం ఎన్నికల కోసం ప్రజలపై కపట ప్రేమను ఒలకబోసేందుకు బస్సు యాత్ర చేస్తానని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్‌వివిఎస్ అప్పలరాజు, అడపా భరత్ బాబు, మంగరౌతు రామకష్ణ, మారిశెట్టి భద్రం, తదితరులు పాల్గొన్నారు.

## తైవాన్ యూనివర్సిటీతో నన్నయ ఎంఒయు

ప్రజాశక్తి - రాజానగరం

ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న విసి పద్మరాజు

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, తైవాన్ దేశానికి చెందిన నేషనల్ ఫార్మోసా యూనివర్సిటీతో మెమోరాండం ఆఫ్ అండ్. స్టాండింగ్ (ఎంఓయూ) కుదుర్చుకుంది. యూనివర్సిటీ విసి హాల్లో ఎంఒయుకు సంబంధించిన సమావేశం మంగళవారం నిర్వహించారు. నన్నయ యూనివర్సిటీ విసి ఆచార్య కె.పద్మరాజు సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, తైవాన్ విశ్వవిద్యాలయ ప్రతినిధి నవీన్ లు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి ఎంఒయును మార్చుకున్నారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ విద్యార్థులు, అధ్యాపకులు పరిశోధన, సమకాలిన అంశాలు, ఫ్యాకల్టీ నైపుణ్యాభివృద్ధి, విద్యార్థులకు ఉపాధికి అవసరమయ్యే నైపుణ్యాలు అందించేందుకు తైవాన్ విశ్వవిద్యాలయంతో ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. అనంతరం యూనివర్సిటీ సెమినార్ హాల్ లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులు నవీన్ ఎంఒయు ద్వారా విద్యార్థులకు, అధ్యాపకులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ బి.జగన్మోహనరెడ్డి, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## నేరాలు ఘోరాలు

వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

### గంజాయి కేసులో నలుగురు యువకుల అరెస్ట్

ప్రజాశక్తి - ఏలేశ్వరం

గంజాయి రవాణా కేసులో నలుగురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రత్తిపాడు సిఐ ఎం.శేఖర్‌బాబు ఈ వివరాలను వెల్లడించారు. ఏలేశ్వరానికి చెందిన గుండ్గోజు వీరవెంకటసత్యశ్రీనివాస్, జొన్నాడ రాజేష్, చిప్పమళ్ల వీరబాబు, లింగంపర్తికి చెందిన పడాల గన్నిరాజు కొంతకాలంగా గంజాయికి బానిసలయ్యారు. గంజాయి వినియోగంతో పాటు అక్రమంగా డబ్బు సంపాదించేందుకు గంజాయి రవాణాను మార్గంగా ఎంచుకున్నారు. నర్సీపట్నం ఏజెన్సీ ప్రాంతంలో యువకులు 24 కిలోల గంజాయిని కొనుగోలు చేసి ఏలేరు రిజర్వాయర్ క్వార్టర్స్ వద్ద పాడుబడ్డ భవనంలో ఉంచారు. మంగళశారం దీన్ని తరలించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. రెండు బైకులను, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశారు. పెద్దాపురం డిఎస్‌పి కె.లతకుమారి, సిఐ ఎం.శేఖర్‌బాబు, ఎస్ఐ జి.సతీష్ బృందాన్ని ఎస్‌పి అభినందించారని తెలిపారు. ఈ దాడుల్లో బి.మాణిక్యం, శ్రీనివాస్ దొర, రవీంద్ర, బాలాజీ, లోవరాజు, జయర్రాం దొర పాల్గొన్నారు.

### అట్రాసిటీ కేసు నమోదు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

పురుగులు మందు సేవించి ఆత్మహత్య చేసుకున్న సంఘటనలో మంగళవారం పోలీసులు ఎస్‌సి,ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఎస్ఐ జి. వెంకటేశ్వరరావు కథనం ప్రకారం సరిపల్లి బాబా నగర్ కు చెందిన దాకారేపు అర్జున రావు(57) కూలి పనులు చేసుకుని చేసుకుని జీవనం సాగిస్తుంటాడు. గ్రామంలో ఆదివారం ఆకుల సత్యనారాయణ (సత్తిపండు) అతని కుమారుడు శ్రీనివాస్ అన్న కుమారుడు ఆది మణికంఠ లు అర్జున రావు తో గొడవపడ్డారు. మనస్థాపానికి గురైన అర్జునరావు సోమవారం సత్యనారాయణ పొలంలోని పాకలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.అర్జున రావు ను అమలాపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మతి చెందాడు. మతుడు అర్జున రావు ఆసుపత్రిలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసి మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### స్థల వివాదంలో వ్యక్తి కి గాయాలు

ప్రజాశక్తి - అంబాజీపేట

స్థల వివాదం నేపథ్యంలో మంగళవారం అంబాజీపేట మండల పరిది ఇరుసుమండ గ్రామంలో మరిదిపై వదిన కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఇరుసుమండకు చెందిన మట్టా రామాంజనేయులు (అంజి) తన ఇంటి వద్ద ఉన్న స్థంబాలను అతని వదిన సుజాత గుణపంతో తవ్వుతుందన్నారు. స్థంబాల వద్ద తవ్వ వద్దని రామాంజనేయులు భార్య సుధ అడ్డుకుండగా వాగ్వాదం జరగడంతో సుధ కింద పడిపోయింది.తన భర్త అంజి పైకి లేవదీసే ప్రయత్నం చేస్తుండగా వదిన సుజాత కత్తితో దాడి చేసిందన్నారు. రామాంజనేయులు(అంజి) ఎడమ చేతికి తీవ్రగాయాలు కాగా అమలాపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. క్షతగాత్రుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎ.చైతన్యకుమార్ తెలిపారు.

### 20 లీటర్ల సారాతో ఇద్దరి అరెస్ట్

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండల పరిధిలోని గజ్జరం గ్రామంలో సారా అమ్ముతున్న వ్యక్తితోపాటు సారా సరఫరా చేస్తున్న మరో వ్యక్తిని 20 లీటర్ల సారాతో అరెస్ట్ చేసినట్లు తాళ్లపూడి ఎస్ఐ రమణ తెలిపారు. గజ్జరం గ్రామానికి దేపాటి నాగేంద్ర సారా అమ్ముతున్నాడని, పోచవరం గ్రామానికి చెందిన మట్టపర్తి నాగరాజు అనే వ్యక్తి నాగేంద్రకు సరఫరా చేస్తున్నాడని తమకి అందిన సమాచారం మేరకు వారిని అరెస్టు చేశామని, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### సారా విక్రేతపై బెండోవర్

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని కలవలపల్లిలో నాటుసారాను విక్రయిస్తున్న వ్యక్తిని బెండోవర్ చేసినట్లు సిఐ ఇటివివి సత్యనారాయణ తెలిపారు. కలవలపల్లిలో పాత నేరస్తుడైన జాను విష్ణును అదుపులోకి తీసుకుని తహశీల్దార్ రాజ్యలక్ష్మి ఎదుట హజరుపర్చి అతనిని బెండోవర్ చేసినట్లు సిఐ తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు

ప్రజాశక్తి - అంబాజీపేట

అంబాజీపేట బస్టాండ్ వద్ద మంగళవారం మూడు ద్విచక్ర వాహనాలు డీ కొట్టడంతో స్కూటీపై వెళుతున్న మహిళకు,మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆమెను ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎ.చైతన్య కుమార్ తెలిపారు. బస్టాండ్ ఎదురుగా మద్యం దుకాణం ఉండటం, దానికి తోడు నిత్యం రద్దీగా ఉండడం, మద్యం కొనుగోలు దారులు రొడ్డుపై ఉండటం వారిని తప్పించ బోయి అదుపు తప్పి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని దీనికి కారణమైన మద్యం షాపును తొలగించాలని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### సారా బట్టీలపై దాడులు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో ముగ్గళ్ళ, ఇనగంటివారి పేట, బొబ్బిల్లంక గోదావరి లంకల్లో నార్త్ జోన్ పోలీసులు, స్పెషల్ పార్టీ మరియు ఎస్ఇబి పోలీసులు నాటు సారా తయారీ కేంద్రాలపై జాయింట్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ దాడుల్లో గోదావరి లంకల్లో 4,800 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో ఎస్ఇబి సిఐ జి.సత్యనారాయణ, ఎస్ఐ నిరంజన్ రావు, కోరుకొండ సిఐ ఉమామహేశ్వరరావు, సీతానగరం ఎస్ఐ చిరంజీవి, రాజమండ్రి నార్త్ జోన్ ఎస్ఇబి సిఐ పివి.రమణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# నాడు 'జయలక్ష్మి'... నేడు 'కార్తికేయ'

- అధిక వడ్డీల ఆశ చూపి మోసం
- ది కార్తికేయ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీపై క్రిమినల్ కేసు నమోదు

ప్రజాశక్తి - కాకినాడ

అధిక వడ్డీ వస్తుందన్న ఆశ డిపాజిదారుల కొంప ముంచుతుంది. తమ కష్టార్జితాన్ని డిపాజిట్ల రూపంలో వేసి తీరా గడువు ముగిసాక అది చేతికి రాక లబోదిబోమంటున్న ఘటనలు జిల్లాలో తరుచూ చోటు చేసుకుంటున్నాయి. నిన్న మొన్నటి వరకూ ది జయలక్ష్మి ఎంఎఎం కో-ఆపరేటివ్ సొసైటీకి చెందిన గత పాలకవర్గం కోట్లాది రూపాయలను ఇష్టారీతిగా వాడేసిన తీరు మరువక ముందే కాకినాడలో కార్తికేయ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ తెరపైకి వచ్చింది. డిపాజిదారులకు గడువు ముగిసినా డబ్బులు చెల్లించక పోవడంతో డిపాజిట్ దారుల్లో ఆందోళన నెలకొంది. సొసైటీలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 600 మంది వరకూ డిపాజిట్‌దారులు ఉన్నారని అధికారులు అంచనా. కాగా వీరిలో 400 మంది సొమ్ముల కోసం బ్యాంకు చుట్టూ తిరుగుతునే ఉన్నారు.

కాకినాడలో 20 సంవత్సరాల క్రితం చైర్మన్ కోడి వీరవెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో కార్తికేయ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ రిజిస్ట్రేషన్ జరిగింది. కాకినాడ నూకాలమ్మ గుడి సమీపంలో ప్రధాన కేంద్రంగా ఏర్పడిన సొసైటీకి అప్పట్లోనే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఖాతాదారులు ఉన్నారు. కోవిడ్ ముందు వరకూ సొసైటీ కార్యకలాపాలు చురుగ్గానే సాగాయి. కోవిడ్ అనంతరం జయలక్ష్మి సొసైటీ బాగోతం బయటపడడంతో సొసైటీలో డిపాజిదారులు తమ డిపాజిట్లు చెల్లించాలంటూ సొసైటీ కార్యాలయానికి తిరగడం ప్రారంభించారు. డిపాజిట్లు మెచ్యూర్ అయినప్పటికీ డిపాజిట్ చెల్లించడం లేదు. దీనితో జిల్లాలోని మామిడికుదురు మండలం నగరానికి చెందిన డిపాజిట్‌దారులు ఆందోళనకు దిగారు. ఖాతాదారులు కోవిడ్, జయలక్ష్మి సొసైటీ ప్రభావంతో డిపాజిట్లను విత్ డ్రా చేసుకున్నారని అందువల్లే తాను డిపాజిట్లు ఇవ్వలేకపోతున్నట్లు చైర్మన్ తెలిపారని సమాచారం. త్వరలోనే డిపాజిట్లు చెల్లిస్తామంటూ కాలం సాగదీస్తూ వస్తుండడంతో తమ డిపాజిట్లు ఇవ్వడం లేదని సుమారు రెండు నెలల క్రితం నగరంకు చెందిన వారు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దీనిపై సహకార అధికారి ప్రాథమిక విచారణకు ఆదేశించారు. అయితే సొసైటీ నిర్వాహకుల నుంచి సరైన సహాయ సహకారాలు అందడం లేదనే ప్రచారం జరుగుతుంది. సొసైటీ చైర్మన్ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారన్న వంకతో విచారణకు సహకరించడంలేదనే వాదనా వినిపిస్తుంది.

**ప్రాథమిక విచారణలో.....**

అసిస్టెంట్ రిజిస్ట్రార్ దుర్గాప్రసాద్ విచారణాధికారిగా నియమించగా తన నివేదికను ఈ ఏడాది జనవరిలో ఉన్నతాధికారులకు అందజేశారు. నివేదికలో 2021-22 ఆడిట్ రిపోర్టు ప్రకారం సభ్యుల నుంచి సుమారు రూ.8 కోట్లు డిపాజిట్లు ఉండగా, 2022-23 నాటికి సుమారు రూ.10 కోట్లుగా ఉంటుందని అంచనా వేశారు. పైగా సొసైటీ రికార్డులు సక్రమంగా నిర్వహించడం లేదని గుర్తించారు. సొసైటీ వచ్చిన డిపాజిట్లలో సుమారు రూ.5.50 కోట్లను రుణాలుగా ఇచ్చారు. వీటిలో కోటి రూపాయల వరకూ సెక్యూరిటీ ఉండగా, మిగిలిన నాలుగున్నర కోట్లకు ఎటువంటి సెక్యూరిటీ లేకుండా కేవలం చెక్కు, ప్రామిసరీ నోటు ఆధారంగా రుణాలు ఇచ్చినట్లు గుర్తించారు. మిగిలిన రెండున్నర కోట్లు డిపాజిట్లపై లోన్లుగా ఉన్నట్లు నివేదికలో తేలింది. దీనితో అవకతవకలపై మరింత లోతుగా దర్యాప్తుకు సెక్షన్ 51 ఎక్వయిరీకి అధికారులు ఆదేశించారు. విచారణలో భాగంగా డిపాజిట దారుల పత్రాలను పరిశీలించనున్నారు. డిపాజిట్ దారుల డిపాజిట్లు రూ.22 కోట్లు పైనే ఉంటుందని విచారణలో తేలిందని జిల్లా అధికారి దుర్గాప్రసాద్ తెలిపారు. ఇప్పటికే క్రిమినల్ కేసులు నమోదు చేశామన్నారు. బ్యాంకు యజమానులకు సంబంధించిన కొంత ఆస్తులను అటాచ్ చేయడం జరిగిందని జిల్లా అధికారి తెలిపారు బాధితులకు ఎప్పటి సొమ్ములు ఇస్తారనేది తెలపలేదు. అయితే మంగళవారం కాకినాడ టూటౌన్ లో బ్యాంకుకు సంబంధించిన వారి వివరాలు వీరి దగ్గర ఉన్నాయని అనుమానంతో ఇద్దరిని పోలీస్ స్టేషన్ కు తీసుకువచ్చి విచారణ చేస్తున్నామని, ఇప్పటివరకు ఎటువంటి అరెస్టులు చూపించలేదని, టూ టౌన్ సిఐ నాయక్ తెలిపారు.

## కాండ్రేగులలో ఇంటింటా టిడిపి ప్రచారం

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండలంలోని కాండ్రేగులలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ మహిళ చైతన్య రథ యాత్ర మంగళవారం నిర్వహించారు. రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ ఆదేశాల మేరకు రాష్ట్ర టిడిపి కార్యదర్శి ఎస్‌విఎస్.అప్పలరాజు ఆధ్వర్యంలో ఈ కారక్రమం చేపట్టారు. ఇంటింటా తిరుగుతూ మినీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ జగన్ రెడ్డి కక్ష సాధింపు చర్యలు మానుకుని, రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. జగన్ ఎన్ని దుర్మార్గపు చర్యలు చేసిన చివరకు న్యాయమే గెలుస్తుందని చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటకు వస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రామిశెట్టి చందర్రావు, బుర్రి భీమరాజు, రామీ శెట్టి పాపారావు, అడపా తాతాజీ, లింగం విష్ణు, రామిశెట్టి విష్ణు, మహిళా శక్తి కమిటీ పోలినాటి ధర్మానందకుమారి పాల్గొన్నారు.

## అల్లిపూడిలో 'ఆదిత్య' ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్

ప్రజాశక్తి - కోటనందూరు

ఆదిత్య ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

అల్లిపూడిలో తుని ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మంగళవారం 'స్వచ్ఛభారత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో పర్యటించి రోడ్లకు ఇరువైపులా ఉన్న పిచ్చి తుప్పలను తొలగించి పరిశుభ్రపరచారు. అనంతరం గ్రామంలో ఉన్న ప్రతి వీధిలోను పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ చింతకాయల చిన్నబాబు, అధ్యాపకులు ఎమ్‌డి.షాహిద్దీన్, ఎన్ఎస్ఎస్ పిఒ కె.తమ్మారావు, ఎం.శ్రీదుర్గ, ఎంపిటిసి, జడ్‌పిటిసి సభ్యులు, సచివాలయం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

## పరిశ్రమలను సందర్శించిన ఆదిత్య విద్యార్థులు

ప్రజాశక్తి - గండేపల్లి

వైభవ్ ఇండస్ట్రీస్ వద్ద ఆదిత్య బిజినెస్ స్కూల్ విద్యార్థులు

గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య గ్లోబల్ బిజినెస్ స్కూల్ విద్యార్థులు తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం కూనవరంలో వైభవ్ ఇండస్ట్రీస్, ఆంధ్రా గోలీ సోడా పరిశ్రమలను సందర్శించారని ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎన్.సుగుణారెడ్డి తెలిపారు. క్షేత్ర పరిశీలన ద్వారా పొందిన జ్ఞానాన్ని భవిష్యత్‌లో వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో అన్వయించుకొని ఉజ్జ్వల మైన ప్రగతికి బాటలు వేసుకోవాలని సూచించారు. పుస్తక పఠనంతో పాటూ క్షేత్ర పరిశీలన కూడా చాలా అవసరమన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ సంజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ ఎ.విజయభార్గవి, విభాగాధిపతి ఎం.గోవర్ధన్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రత్యక్ష పరిశీలనతో మరింత విశ్లేషణాత్మక జ్ఞానం పొందడానికి ఇలాంటి టూర్‌లు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ బి.సూర్యతేజ, వెంకటపద్మ, రాజ్ కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

## సామాజిక చైతన్యంపై అవగాహన

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

విద్యార్థులు చదువుతో పాటు సామాజిక చైతన్యం కలిగించే అంశాల పై అవగాహన కలిగి ఉండాలని ఆర్‌జెడి జి.నాగమణి అన్నారు. మంగళవారం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌ను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పరీక్ష పే చర్చలో పాల్గొని ప్రధాని మోడీ నుంచి అభినందన పొందిన పదో తరగతి విద్యార్థి హరి ప్రియుడు కు ప్రశంసా పత్రాన్ని అందించారు. సిబిఎస్ఇ పరీక్షా పత్రాలను పరిశీలించారు. చదువుతో పాటు అన్ని కార్యక్రమాల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తున్న హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణను ఆమె అభినందించారు. ఆమె వెంట డివైఇఒ ఆర్‌జెడి.రాజు, ఎంఇఒలు పాల్గొన్నారు.

## వివాదాలు తావులేకుండా సమస్యలు పరిష్కరించుకోవాలి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

వివాదాలకు తావులేకుండా గ్రామంలోనే సమస్య లు పరిష్కరించుకోవాలని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షులు, బిసి సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు మార్యాపురం కనకారావు అన్నారు. మంగళవారం తాతపూడిలో జిల్లా అధ్యక్షులు వెన్నేటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం, బిసి సోదరుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య పాల్గొని మాట్లాడారు . గతంలో శెట్టిబలిజలకు, నాయీ బ్రాహ్మణులకు కొబ్బరి మొక్కల విషయంలో ఉన్న సమస్యను రెండు వర్గాల పెద్దల ద్వారా పరిష్కరించుకున్నట్లు గ్రామ నాయి బ్రాహ్మణ సంఘం పెద్ద వెన్నేటి వెంకన్నకు కనకారావుకు తెలిపారు.ఈ సమస్యపై ఆయన మాట్లాడుతూ రెండు వర్గాలు ఐకమత్యంగా ఉండాలన్నారు. ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా అధ్యక్షులు డి.పాపారావు, మూడు జిల్లాల న్యాస్ కోఆర్డినేటర్ ఎన్.పాపారావు , దాలిపర్తి రామ్మోహన్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు చక్రవర్తి , కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శి లంక రాజు తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు బాధ్యతగా పనిచేయాలి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే అభివద్ధి కమిటీ సమావేశాలకు అధికారులు గైహాజరవకుండా బాధ్యతగా పనిచేయాలని ఎంఎల్‌ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. మంగళవారం కపిలేశ్వరపురం సిహెచ్ సిలో నిర్వహించిన ఆసుపత్రి అభివద్ధి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత జూలై నెలలో జరిగిన సమావేశానికి ఎంపిడిఒ, సూపరింటెండెంట్, కార్యదర్శి, మెంబర్లు గా ఉన్నప్పటికీ వారు హాజరు కాకపోవడంతో కొన్ని అవసరమైన తీర్మానాలు రాసి కోరం లేని కారణంగా మిగిలిన సభ్యులను సలహా అడిగి అనుమతి తీసుకున్నామన్నారు. మరలా తిరిగి మంగళవారం జరిగిన సమావేశానికి కూడా ఏ సభ్యులు హాజరు కాకపోవడం విచార కర మన్నారు. దీంతో మూడు సమావేశాలు కోరం లేక వాయిదా పడ్డాయి. దీనిపై ఎంపిడిఒను ఫోన్లో సంప్రదించగా తాను జగనన్న సురక్ష కార్యక్రమంలో ఉన్నట్లు చెప్పారన్నారు. దీనిపైన ఆసుపత్రి సమస్య పై జిల్లా కలెక్టర్ కు లెటర్ పెడతానన్నారు. అలాగే ఇక్కడ పనిచేస్తున్న ముగ్గురు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సుమారు ఏడాది గా జీతాలు లేక పనిచేస్తున్నట్లు చెప్పారన్నారు. వీటిపై ప్రిన్సిపల్ సెక్రెటరీ, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్, జిల్లా కలెక్టర్‌కు కూడా లెటర్ రాయనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో గ్రామ సర్పంచ్ శాఖ శ్రీనివాస్, ఇన్ చార్జ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజకుమార్, ఇన్‌చార్జి కార్యదర్శి శివ చక్రవర్తి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంగరలో ఉపాధి హామీ గ్రామసభ

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

అంగర గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం ఉపాధి హామీ గ్రామసభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ వాసా కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఉపాది గ్రామ సభలో ఎన్‌ఆర్‌ఇజిఎస్ ఎపిఒ బి. వెంకటలక్ష్మి మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామంలో చేపట్టవలసిన ఉపాధి పనుల ప్రణాళిక నివేదికను గ్రామ సభలో వివరించారు . గ్రామంలో పనులు చేపట్టుటకు చర్చలు జరిపారు. గ్రామ పరిదిలో చేపట్టబోయే పంట కాలువల పూడికతీత, చెరువులు పునరుద్ధరణ, మట్టి రోడ్ల నిర్మాణం పనులకు సంబంధించి 72 పనులను గుర్తించినట్లు ఫీల్డ్ అసిస్టెంట్ బోణం శ్రీరాములు తెలిపారు. గుర్తించిన పనుల వివరాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఎపిఒ తెలిపారు. సమావేశంలో ఎంపిటిసి సభ్యుడు అడ్డాల శ్రీనివాస్, పిఎసిఎస్ చైర్మన్ గంగుమళ్ళ రాంబాబు, చేనేత సహకార సంఘం చైర్మన్ గుడిమెట్ల రాంబాబు, కార్యదర్శి టి.సుభాకర్, టెక్నికల్ అసిస్టెంట్ లోవరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ బోణం శ్రీరాములు, ఉపాధిమేట్లు, రైతులు, పాల్గొన్నారు.

## మండపేటలో భారీ అన్న సమారాధన

ప్రజాశక్తి-మండపేట

స్థానిక రెండవ వార్డులోని మైత్రి మెకానిక్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి మహోత్సవాల సందర్భంగా మంగళవారం భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఎంఎల్‌ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణిలు అన్న సమారాధన ప్రారంభించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు రేలంగి వేణుగోపాలరావు, కార్యదర్శి తీరందాసు శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చిత్రలేఖన పోటీల్లో విజేతలకు అభినందనలు

అవార్డుఅందుకుంటున్న లక్కవరానికి చెందిన శ్రీనివాస్

చెముడులంలో విద్యార్థులను అభినందిస్తున్న సర్పంచ్ శ్రీనివాస్‌తదితరు

ప్రజాశక్తి-యంత్రాంగం

క్రియేటిక్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఇటీవల అమలాపురంలో రాష్ట్ర స్థాయి చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా విజేతలను పలువురు అభినందించారు.

**రాజోలు** క్రియేటిక్ ఆర్ట్స్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ సంస్థ అధ్యక్షులు అంజి అకొండి నిర్వహించిన వందే వేద భారతం రాష్ట్రస్థాయి చిత్రకళ పోటీల్లో మలికిపురం మండలం లక్కవరం కి చెందిన నల్లి శ్రీనివాస్ సీనియర్స్ విభాగం లో క్రియేటివ్ ఆర్టిస్ట్ అవార్డు అందుకున్నారు.ఈ పోటీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా 360 మంది చిత్రకారులు పాల్గొనగా 85 మంది చిత్రకారులకు బహుమతులు అందజేశారు. అమలాపురం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వేదికగా ఈ చిత్రాలను మూడు రోజులపాటు చిత్రకళా ప్రదర్శనలో ఉంచారు,అ నంతరం జరిగిన బహుమతి ప్రధానోత్సవ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏలూరు చిత్రాలయ, ప్రముఖ చిత్రకారులు ఎం.రాంబాబు, విశిష్ట అతిథిగా సమనస ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ ఎన్ మనువిహార్, సభాధ్యక్షులు అకొండి పవన్ కుమార్, కోనసీమ జిల్లా సమగ్ర శిక్షా సిఎంఒ బొరుసు, వివి.సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా అవార్డును శ్రీనివాస్ అందుకున్నారు.**ఆలమూరు** ఇటీవల క్రియేటివ్ ఆర్ట్స్, అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి చిత్రలేఖనం పోటీలు అమలాపురంలో నిర్వహించారు. ఈ పోటీలకు చెముడులంక ఎస్టిఎస్ఎన్ఎం జెడ్పి హైస్కూల్ విద్యార్థులు పాల్గొని తమ సత్తాను సాటి రాష్ట్రస్థాయి టాప్ 10లో నిలిచారు. ఇందులో 10 వ తరగతి విద్యార్థి కె.విష్ణు అత్యుత్తమ ప్రతిభను కనబర్చి క్రియేటివ్ ఆర్ట్స్ అవార్డును కైవసం చేసుకున్నాడు. అలాగే 7వ తరగతి విద్యార్థినిలు ఎ.సిరి, కె.లావణ్య, ఆర్.పద్మశ్రీ, సిహెచ్.సాయిరాం మిగిలిన స్థానాల్లో విజేతలుగా నిలిచి ప్రశంస పత్రాలతో పాటు మెడల్స్ ను గెలుచుకోవడంతో పలువురు అభినందించారు. ఈ సందర్భంగా మంగళవారం ప్రధానోపాధ్యాయులు బి.శివరాం కుమార్ అధ్యక్షతన పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. ముందుగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయురాలు మేడపాటి వీరలక్ష్మి, సర్పంచ్ తమ్మన శ్రీనివాసు, విద్యా కమిటీ చైర్మన్ సుంకర శ్రీనివాసు, తిరనాతి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## బంగారు పతక విజేతలకు ప్రశంసలు

ప్రజాశక్తి-మండపేట



అభినందన సభలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్

సౌత్ ఆఫ్రికాలో టెన్నికాయిట్ వరల్డ్ ఛాంపియన్షిప్ లో ఇండియా తరపున ప్రాతినిధ్యం వహించి వరల్డ్ ఛాంపియన్షిప్ లో గోల్డ్ మెడల్ గెలుచుకుని విజేతలుగా నిలిచిన మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పి.రామారావు, వి.వినయ్ లను కళాశాల అధ్యాపక బృందం మంగళవారం అభినందించింది.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డా.శ్రీనువాసరావు మాట్లాడుతూ ప్రపంచ పటంలో మండపేటను, ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నిలిపేలా చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఎ.ఆనందరావు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ హెడ్ టి.త్రినాధ్, పీడీ యన్.వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## దళితుల పట్ల వివక్ష మానుకోవాలి

ప్రజాశక్తి-మండపేట

దళితుల పట్ల వివక్ష మానుకోవాలని ఎమ్ఆర్‌పిఎస్ నాయకులు దూళి జయరాజు అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ దళితుల దహన సంస్కారాలకు పాలకులు, ప్రభుత్వం స్థలం కేటాయించేందుకు చొరవ చూపకపోవడం దళితుల పట్ల వారికి ఉన్న వివక్ష స్పష్టంగా కనిపిస్తోందన్నారు. బానిసత్వం నుంచి ప్రశ్నించేందుకు మొట్టమొదటిసారిగా వినూత్నంగా అర్తమూరు దళితులు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. దళితులకు శ్మశానవాటిక తదితర సౌకర్యాల కల్పన కోసం ఎమ్ఆర్‌పిఎస్ మద్దతు ఇవ్వడంతో పాటు వారి పోరాటంలో భాగస్వామ్యం తీసుకుందన్నారు. ఇది ఒక్క అర్తమూరు సమస్య కాదని నియోజకవర్గంలో ఏఏ గ్రామాల్లో ఇటువంటి సమస్యలున్నాయో సేకరించి దళితులందరితో ఐక్యకార్యచరణ రూపొందించి పోరాటాన్ని ముందుకు తీసుకు వెళతామన్నారు.

## పాలగుమ్మిలో 'మహా సంకల్పయాత్ర'

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

అమలాపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ శెట్టిబత్తుల రాజబాబు ఆధ్వర్యంలో మంగళవారం అమలాపురం మండలం పాలగుమ్మి గ్రామంలో మహా సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏమి సమస్యలు ఉన్నాయని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక వికలాంగులకు, వృద్ధులకు కూడా 300 యూనిట్లు దాటితే పెన్షన్ తీసుకోవడానికి అనర్హులుగా గుర్తించి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని రాజబాబుకు వృద్ధులు తెలియజేశారు. అంతేకాకుండా దళిత వాడల్లో సరైనటువంటి రోడ్లు,డ్రైనేజీలు లేక కొద్దిపాటి వర్షం కురిసేటప్పటికీ ఇబ్బందులు పడుతున్నామని మహిళలు రాజబాబు దృష్టికి తీసుకువచ్చారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు రంకిరెడ్డి నారాయణరావు, మోసుగంటి మల్లికా, రంకిరెడ్డి సతీష్, అరిగెల వీరన్న, కురసాల చంటి తదితరులు పాల్గొన్నారు.

## యానాం వార్తలు

### శ్రీనివాస్‌కు ఉత్తమ సేవా పురస్కారం

ప్రజాశక్తి - యానాం

పాఠశాలల పరిధిలో ఉత్తమ సేవా కార్యక్రమాలు నిర్వహించే ప్రోగ్రాం ఆఫీసర్లను ప్రోత్సహించేందుకు పుదుచ్చేరి స్టేట్ ఎన్ఎస్ఎస్ సెల్ ఏర్పాటు చేసిన అవార్డును వరుసగా రెండో సారి గుత్తుల శ్రీనివాస్ దక్కించుకున్నారు. వివేకానంద పబ్లిక్ స్కూల్ వ్యాయామోపాధ్యాయుడు శ్రీనివాస్ బెస్ట్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అవార్డును పుదుచ్చేరి క్రీడలశాఖ మంత్రి నమశ్శివాయం నుంచి అందుకున్నారని రీజినల్ కో-ఆర్డినేటర్ చింతపల్లి కృష్ణసుధాకర్ తెలిపారు.

### ఆర్థిక సాయానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - యానాం

యానాంలో ఎటువంటి పింఛన్ పథకాలు తీసుకోని, కుటుంబానికి యజమానిగా ఉన్న మహిళలకు మహిళా శిశు అభివద్ధి శాఖ ద్వారా ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం దరఖాస్తులు కోరుతోందని ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు.ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి ఎరుపురంగు రేషన్ కార్డు కలిగి ఉన్నవారు అర్హులన్నారు. దరఖాస్తులు తన కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు.

## నల్ల బెలూన్లతో నిరసన

**కాకినాడ :** టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అరెస్టుకు నిరసనగా మాజీ మేయర్, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షులు సుంకర పావని ఆధ్వర్యంలో మంగళవారం జడ్‌పి సెంటర్‌లో ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద నల్ల బెలూన్లు ఎగురవేసి, బాబుతో మేము అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ టిడిపి శ్రేణులు నిరసన తెలిపాయి. ఈ సందర్భంగా సుంకర పావని మాట్లాడుతూ 14 ఏళ్లపాటు అవినీతి మచ్చ లేకుండా ముఖ్యమంత్రి పనిచేసిన చంద్రబాబును అక్రమంగా రిమాండ్‌లో పెట్టడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో చల్ల పార్వతి, పాలిక సత్య, నక్క జ్యోతి, రేలంగి లక్ష్మి, కనకం, దుర్గ, సత్యవతి, నిర్మల, రమణ, భ్రమరాంబ, చింత భవాని తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిపై పీడీ యాక్ట్ కేసు నమోదు

**రౌతులపూడి :** గంజాయి అక్రమ రవాణాకు సంబంధించి మండలంలోని ఎస్ పైడిపాల గ్రామానికి చెందిన బళ్లాడి అశోక్‌పై పీడీ యాక్ట్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అబ్దుల్ నబీ తెలిపారు. గతంలో గంజాయి అక్రమ రవాణా కేసులు అశోక్‌పై నమోదు కావడంతో కలెక్టర్ ఉత్తర్వులు మేరకు కేసు నమోదు చేశామన్నారు నిందితుని రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు

## రైతులకు అందుబాటులో ఎరువులు

**గోపాలపురం :** ఈ ఏడాది పొగాకు పంట కాలానికి కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ ఎం.ఆదిశేషయ్య, వేలం నిర్వహణ అధికారి అమాల్ డి.శామ్ తెలిపారు. రాజమహేంద్రవరంలో ఆర్ఎంఎస్ కార్యాలయంలో ఎరువుల అమ్మకాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎరువులను రైతులకు అందించడం ఇప్పటికే ప్రారంభం అయ్యిందని తెలిపారు. పొగాకు బోర్డు అధికారులు సూచనల మేరకు మాత్రమే పంటలకు అవసరమయ్యే ఎరువులు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఆఫీసర్ హేమస్మిత పాల్గొన్నారు.

**ప్రకటన**

(దస్తావేజు పోయిన విషయమై)

మాక్లయింటు గ్రంధి (లేటు) **అప్పలస్వామి గారి కుమారుడు గ్రంధి అప్పారావు,** డోర్ నెం.43-9-33 మరియు 43-9-33/1 మేదరపేట, రాజమండ్రి కాపురస్తులు ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా..,

మాక్లయింటు గ్రంధి అప్పారావుకు ఈ దిగువ షెడ్యూలాస్థి, వారి తల్లిదండ్రులు అయిన గ్రంధి అప్పలస్వామి మరియు గ్రంధి పార్వతమ్మ ఏకస్తులైవ్రాసిన ది.18-08-1995 వీలునామా రీత్యా దఖలుపడినది. మాక్లయింటు తల్లిదండ్రులు అయిన గ్రంధి అప్పలస్వామి మరియు గ్రంధి పార్వతమ్మ జాయింటుగ, రాచర్ల జాకబ్ జయరాజ్ వగైరాల నుండి ది.27-05-1982 సం॥రం తేదీని క్రియంపొందిన ఆస్థి తాలూకు, ఒరిజినల్ క్రియదస్తావేజు మాక్లయింటు ది.06-09-2023 తేదీని ది.ఇన్నీసుపేట కోఆపరేటివ్ బాంకు మెయిన్‌రోడ్, Opp. శ్యామల థియేటర్, రాజమండ్రికి లోను విషయమై సంప్రదించుటకు వెళు చుండగ, సదరు క్రియ దస్తావేజు ఒరిజినల్ శ్యామల థియేటర్ పరిసర ప్రాంతములో పోయినది, ఎంతవెదికినను దొరకియుండలేదు, సదరు పైన తెలిపిన ది.27-05-1982 ఒరిజినల్ క్రియదస్తావేజు ఎవరికైనా దొరికిన ఎడల మాక్లయింటుకుగాని, దిగువ చిరునామావారికిగాని అందజేయగలరని కోరడమైనది.

__షెడ్యూలాస్థి:__ తూర్పు గోదావరి జిల్లా, రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోగల, మేదరపేట, రాజమండ్రి డోర్ నెం.43-9-33/1, ప్లాటు నెం.109లో గల 86 చ॥గ॥ల పెంకిటిల్లు షెడ్డు, స్థలమునకు హద్దులు: __తూర్పు:__ మా తాలూకు ప్లాటు నెం.111 మేడ ఇల్లు, __పడమర:__ పిల్లి నాగేశ్వర రావు ఆస్తి, __ఉత్తరం:__ రోడ్, __దక్షిణం:__ రామాలయం తాలూకు స్థలం.

రాజమండ్రి, ది.10-10-2023.

**చల్లా దుర్గాప్రసాదరావు** (నోటరి)
**చల్లా చంద్రశేఖర్**
**చల్లా ఎన్.వి.భారతి**
**సూరెడ్డి రమేష్**
అడ్వకేట్స్, 36-28-12, ఇన్నీసుపేట, సాయిబాబా గుడివీధి, రాజమండ్రి.
సెల్: 99666 74555

**మహారాజశ్రీ రామచంద్రపురం అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**

**O.S.No. 175/2023**

__బిట్వీన్:__

పట్నాల ఎన్.వి.ఈశ్వరరావు, తండ్రి: రామకృష్ణ రావు, 44 సం॥లు, హిందూ, వ్యవసాయం, R/o. డో.నెం. 14-8-50/11, పిల్లా వారి వీధి, రామచంద్రపురం టౌన్ మరియు మండలం, R.C.P.J.C.J.C.

...వాది

మరియు

వాకాడ సత్యనారాయణ, తండ్రి: అప్పారావు, C/o. లేటు నందగిరి సంజీవరావు గారి ఇల్లు, 43 సం॥లు, హిందూ, నిల్, R/o. డో.నెం. 19-8-1, మైత్రి డిజైనర్స్ వీధి, రత్నంపేట, రామచంద్రపురం టౌన్ మరియు మండలం, R.C.P.J.C.J.C.

...ప్రతివాది

పై నెంబరు దావా నందు ప్రతివాదులు హాజరు నిమిత్తం **ది.19-10-2023** వాయిదా **అయి ఉన్నది. కావున మీరు ఆరోజు ఉదయం గం॥ 10:30 ని॥లకు శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు కాబడి మీ సంజాయిషీని తెలియజేసుకోవలెను.** లేనిచో సదరు దావా మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులను అనుసరించి)

**కముజు సూర్యనారాయణ**
వాది తరుపు అడ్వకేట్,
రామచంద్రపురం.
డా॥బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా.
09-10-23. సెల్: 98493 79828